# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 05 | సంచిక : 082
పేజీలు : 06 | వెల: రూ.5/-
శుక్రవారం
మార్చి 13, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




3లో..

## గ్యాస్ గోదాంలపై సివిల్ సప్లై తనిఖీలు

- సిలిండర్లు స్వాధీనం.. కేసులు నమోదు
- వరంగల్ వాయిస్ కథనానికి స్పందన



# విద్యార్థి భవితకు 'పది' పరీక్ష

- రాష్ట్రవ్యాప్తంగా సర్వం సిద్ధం
- ఈసారి మారిన పరీక్షా సరళి..
- ఒక్కో పేపర్‌కు 3 నుంచి 5 రోజుల గడువు
- గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి



విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు తొలి మెట్టుగా భావించే పదో తరగతి వార్షిక పరీక్షల సమరానికి తెలంగాణ రాష్ట్రంలో సర్వసిద్ధమైంది. శనివారం నుంచి ప్రారంభం కానున్న ఈ విద్యా మహాకుంభం ఏప్రిల్ 13 వరకు కొనసాగనుంది. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ తెలిపారు. గతంలో ఆదివారం మినహా వరుసగా జరిగే పరీక్షల విధానానికి ఈసారి స్వస్తి పలికారు. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు ఒక్కో సబ్జెక్టుకు మధ్య 3 నుంచి 5 రోజుల వరకు సెలవు ఇచ్చారు. మార్చి 14న ఫస్ట్ లాంగ్వేజ్, 18న సెకండ్ లాంగ్వేజ్, 23న ఇంగ్లీష్, 28న మ్యాథ్స్, ఏప్రిల్ 2న ఫిజిక్స్, 7న బయాలజీ, 13న సోషల్ స్టడీస్ పరీక్షలు జరగనున్నాయి. 15, 16 తేదీల్లో ఒకేషనల్ కోర్సు పరీక్షలు ఉంటాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 5,28,239 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండటంతో ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 5,17,727, గతంలో తప్పిన వారు 10,512, ఇందులో ప్రైవేటు పాఠశాలలు 2,50,015 మంది, ప్రభుత్వ పాఠశాలలు 2,07,573 మంది, సంక్షేమ గురుకులాలు 60,139 మంది ఈ పరీక్షలు రాయనున్నారు.

- వరంగల్ వాయిస్, ప్రత్యేక ప్రతినిధి

వివరాలు 2లో..



3లో..

## ఆలయ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- కలెక్టర్ దివాకర టీఎస్
- మేడారం గద్దెలపై చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలి
- ఉగాది నాటికి ఇందిరమ్మ ఇళ్లు పూర్తి కావాలి



6లో..

## భద్రకాళి చెరువు పునరుద్ధరణకు రూ.16.10 కోట్లు

- ఎమ్మెల్యే నాయిని, మేయర్, కలెక్టర్
- చెరువు పూడికతీత పనులకు శ్రీకారం
- మే 15 లోగా పనులు పూర్తి చేయాలని డెడ్ లైన్
- ఆలయం నుంచి బండ్ వైపు 'గ్లాస్ వంతెన'




2లో..

## దేశంలోనే తొలిసారిగా డిజిటల్ విధానంలో 'జనగణన'

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- మే 11 నుంచి జూన్ 9 వరకు మొదటి దశ ఇళ్ల జాబితా నమోదు



6లో..

## రాష్ట్రంలో గ్యాస్ కొరత లేదు

వదంతులు నమ్మొద్దు

కలెక్టర్లు, ఎస్పీలతో మంత్రుల వీడియో కాన్ఫరెన్స్

# విద్యార్థి భవితకు 'పది' పరీక్ష

- రాష్ట్రవ్యాప్తంగా సర్వం సిద్ధం
- ఈసారి మారిన పరీక్షా సరళి..
- ఒక్కో పేపర్‌కు 3 నుంచి 5 రోజుల గడువు
- గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి



**వరంగల్ వాయిస్, ప్రత్యేక ప్రతినిధి** : విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు తొలి మెట్టుగా భావించే పదో తరగతి వార్షిక పరీక్షల సమరానికి తెలంగాణ రాష్ట్రంలో సర్వసిద్ధమైంది. శనివారం నుంచి ప్రారంభం కానున్న ఈ విద్యా మహాకుంభం ఏప్రిల్ 13 వరకు కొనసాగనుంది. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ తెలిపారు. గతంలో ఆదివారం మినహా వరుసగా జరిగే పరీక్షల విధానానికి ఈసారి స్వస్తి పలికారు. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు ఒక్కో సబ్జెక్టుకు మధ్య 3 నుంచి 5 రోజుల వరకు సెలవు ఇచ్చారు. మార్చి 14న ఫస్ట్ లాంగ్వేజ్, 18న సెకండ్ లాంగ్వేజ్, 23న ఇంగ్లీష్, 28న మ్యాథ్స్, ఏప్రిల్ 2న ఫిజిక్స్, 7న బయాలజీ, 13న సోషల్ స్టడీస్ పరీక్షలు జరగనున్నాయి. 15, 16 తేదీల్లో ఒకేషనల్ కోర్సు పరీక్షలు ఉంటాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 5,28,239 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండటంతో ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 5,17,727, గతంలో తప్పిన వారు 10,512, ఇందులో ప్రైవేటు పాఠశాలలు 2,50,015 మంది, ప్రభుత్వ పాఠశాలలు 2,07,573 మంది, సంక్షేమ గురుకులాలు 60,139 మంది ఈ పరీక్షలు రాయనున్నారు.

### పరీక్షా కేంద్రాల ఏర్పాటు

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2,676 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు. ఇందులో 1,582 ప్రభుత్వ విద్యాసంస్థలు ఉండగా, 1,094 ప్రైవేటు విద్యాసంస్థలలో కేంద్రాలను ఏర్పాటు చేశారు. హాల్ టికెట్లు ఇప్పటికే అన్ని పాఠశాలలకు చేరుకున్నాయని, ఆన్‌లైన్ ద్వారా కూడా డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కల్పించామని అధికారులు తెలిపారు. విద్యార్థులు తాము చదువుతున్న పాఠశాల గుర్తింపు బయటపడకుండా ఉండేందుకు సాధారణ దుస్తుల్లోనే పరీక్షలకు హాజరు కావాలని విద్యాశాఖ స్పష్టం చేసింది. మాస్ కాపీయింగ్, ఇతర అక్రమాలకు తావులేకుండా 144 ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లను రంగంలోకి దింపారు.



### గంట ముందే కేంద్రానికి చేరుకోవాలి

ఉదయం 9:30 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుంది. అయితే విద్యార్థులు కనీసం గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. నిమిషం నిబంధన అమల్లో ఉండే అవకాశం ఉన్నందున విద్యార్థులు సమయపాలన పాటించాలని కోరారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, వెలుతురు వంటి కనీస వసతులు కల్పించామని, విద్యార్థుల సౌకర్యార్థం పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేసినట్లు సంచాలకులు వివరించారు.



# ప్రపంచానికి దిక్సూచి 'ఏకాత్మ మానవతా వాదం'

☐ బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్

**వరంగల్ వాయిస్, కరీమాబాద్** : పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ అందించిన 'ఏకాత్మ మానవతా వాద' సిద్ధాంతం ప్రపంచానికే దిక్సూచి అని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కరీమాబాద్ మండల అధ్యక్షులు బోరిగం నాగరాజు అధ్యక్షతన రోటరీ క్లబ్ హాల్‌లో నిర్వహించిన 'పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాఅభియాన్–2026' కార్యశాలలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పాశ్చాత్య స్వార్థపూరిత, పెట్టుబడిదారీ ధోరణుల వల్ల మానవత మంటగలుస్తున్న తరుణంలో, భారతీయ విలువల అమలు కోసం దీన్ దయాళ్ గారు జనసంఘ్‌ను స్థాపించారని, అదే నేడు బీజేపీగా అవతరించి సాంస్కృతిక జాతీయవాదాన్ని పటిష్టపరుస్తోందని గంట రవికుమార్ తెలిపారు. సమాజంలోని చివరి వ్యక్తికి కూడా ఫలాలు అందాలనే 'అంత్యోదయ' లక్ష్యంతోనే కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను రూపొందించిందని, దీనివల్ల దేశంలో పేదరికం, అసమానతలు తగ్గుతున్నాయని పేర్కొన్నారు. దీన్ దయాళ్ సిద్ధాంతాల పునాదుల మీదనే నేడు భారత్ స్వశక్తితో, స్వాభిమానంతో ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదుగుతోందని కొనియాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో "మేక్ ఇన్ ఇండియా", "వోకల్ ఫర్ లోకల్" వంటి కార్యక్రమాలు దీన్ దయాళ్ ఆలోచనలకు ప్రతిరూపాలని, కమ్యూనిజం, క్యాపిటలిజం దుష్పరిణామాలను అణిచివేస్తూ దేశం వెలుగుల వైపు నడుస్తోందని అన్నారు. ఈ కార్యశాలలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల మహేష్, బైరి నాగరాజు, ప్రశిక్షణ మండల కన్వీనర్ వంచనగిరి రాజ్ కుమార్, జిల్లా నాయకులు మాచర్ల దీన్ దయాళ్, మదాసు రాజు, టేకుమట్ల రేణుక, వివిధ మండలాల పదాధికారులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

- నాగుర్ల వెంకటేశ్వర్లు
- రాష్ట్ర అభివృద్ధిలో డీలర్ల పాత్రే కీలకం
- నూతన రాష్ట్ర కార్యవర్గానికి ఘనంగా సన్మానం

**వరంగల్ వాయిస్, వరంగల్** : రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించినప్పుడే డీలర్లపై నమ్మకం పెరుగుతుందని, వ్యవసాయ రంగ అభివృద్ధిలో డీలర్ల పాత్ర అత్యంత కీలకమని తెలంగాణ రాష్ట్ర ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగుర్ల వెంకటేశ్వర్లు అన్నారు. వరంగల్ శివనగర్‌లోని అసోసియేషన్ భవనంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇటీవల ఎన్నికైన నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగుర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులే రాజులు కావాలనే సంకల్పంతో డీలర్లు పనిచేయాలని, నాణ్యమైన కంపెనీల విత్తనాలను మాత్రమే విక్రయించాలని సూచించారు. ఏదైనా కొత్త మందును లేదా విత్తనాన్ని ప్రయోగాత్మకంగా పరీక్షించకుండా రైతులకు ప్రమోట్ చేయవద్దని హెచ్చరించారు. రాష్ట్ర కార్యవర్గం తీసుకునే నిర్ణయాలకు డీలర్లందరూ కట్టుబడి ఉండాలని, సంఘటితంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. వరంగల్ జిల్లాలో ఉన్న తరహాలోనే రాష్ట్ర రాజధానిలో అందరి సహకారంతో అసోసియేషన్ భవనాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. జిల్లాల నుండి వచ్చే డీలర్లకు వసతి కల్పించేలా గదులను నిర్మిస్తామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామడుగు మనోహర్ డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లకు ఏ కష్టం వచ్చినా సంఘం అండగా ఉంటుందని, అయితే ఎవరూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పనిచేయకూడదని సూచించారు. రాష్ట్ర కోశాధికారి సిద్ధి నాగరాజు త్వరలోనే నిధులు సేకరించి రాష్ట్ర స్థాయిలో అసోసియేషన్ భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి బొద్దిరెడ్డి నరసింహారెడ్డి, రాష్ట్ర నాయకులు సత్యనారాయణ రెడ్డి, కేదారి, పాండురంగయ్య, మాడిశెట్టి అశోక్, శేఖర్, రతన్, రాజేందర్ రెడ్డి, రమేష్, రవి, అమూల్య ప్రవీణ్, సదానందం, మురళి తదితరులు పాల్గొన్నారు.

# దేశంలోనే తొలిసారిగా డిజిటల్ విధానంలో 'జనగణన'

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- మే 11 నుంచి జూన్ 9 వరకు మొదటి దశ ఇళ్ల జాబితా నమోదు

**వరంగల్ వాయిస్, వరంగల్** : దేశాభివృద్ధికి, ప్రభుత్వ సంక్షేమ పథకాల పంపిణీకి కీలకమైన 'జనాభా గణన–2027' ప్రక్రియను జిల్లాలో అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జిల్లా, మండల, మున్సిపల్ స్థాయి అధికారులకు ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. మొదటి దశ మే 11 – జూన్ 9 2026 వరకు ఇళ్ల జాబితా, గృహాల గణన జరుగుతుంది. సుమారు 33 రకాల ప్రశ్నలతో ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటిని సందర్శిస్తారు. రెండవ దశ ఫిబ్రవరి 2027లో జనాభా గణన నిర్వహిస్తారు. మార్చి 1, 2027ను రిఫరెన్స్ తేదీగా పరిగణిస్తారు. ఈసారి జనాభా గణనను దేశంలోనే తొలిసారిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నారు. పేపర్ ఫారాలకు బదులుగా మొబైల్ యాప్‌లు, వెబ్ పోర్టల్‌లను ఉపయోగిస్తారు. అంతేకాకుండా, ప్రజలు తమ వివరాలను తామే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు వీలుగా సర్వేకు 15 రోజుల ముందే ప్రత్యేక పోర్టల్ అందుబాటులోకి వస్తుందని కలెక్టర్ తెలిపారు. డి.సుబ్బరాజు, గణాంక అధికారి ఎస్.సతీష్ ఈ శిక్షణను నిర్వహిస్తున్నారు. జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి చంద్రకళ మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ జాతీయ ప్రాముఖ్యత కలిగిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంధ్యారాణి, వై.వి.గణేష్, డీఆర్ఓ విజయలక్ష్మి, జెడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, ఆర్డీఓలు సుమా, ఉమారాణి, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ డిజిటల్ కేబుల్ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా కమటం వేణుగోపాల్



**వరంగల్ వాయిస్, వరంగల్** : తెలంగాణ డిజిటల్ మీడియా కేబుల్ న్యూస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కమిటీని ప్రకటించడం జరిగింది. వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా A1 టీవీ మీడియా ఛానల్ కమటం వేణుగోపాల్ ని రాష్ట్ర కమిటీ అధికారకంగా నియమించడం జరిగింది. మార్చి 13 నుంచి రెండు సంవత్సరాల కాలం పాటు వేణుగోపాల్ ఈ పదవిలో కొనసాగుతారని తెలంగాణ డిజిటల్ కేబుల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాచర్ల గోపి ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు రాచర్ల గోపి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కమటం వేణుగోపాల్ కి శుభాకాంక్షలు తెలుపుతూ కేబుల్ ఛానల్ వ్యవస్థలో పనిచేస్తున్న ప్రతి ఒక్క జర్నలిస్టుకి అందవలసిన పథకాలు అందించే విధంగా కృషి చేయాలని కోరారు.

# ఆలయ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- కలెక్టర్ దివాకర టీఎస్
- మేడారం గద్దెలపై చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలి
- ఉగాది నాటికి ఇందిరమ్మ ఇళ్లు పూర్తి కావాలి



**వరంగల్ వాయిస్, ములుగు/తాడ్వాయి :** మేడారం శ్రీ సమ్మక్క-సారలమ్మ ఆలయ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, ఎండ తీవ్రత దృష్ట్యా భక్తుల సౌకర్యార్థం గద్దెలపై వెంటనే చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఎస్.ఎస్.తాడ్వాయి మండలంలోని మేడారం ఆలయంతో పాటు, '99 రోజుల ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఊరట్టం గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తూరులో పర్యటించారు. వేసవి దృష్ట్యా గద్దెల వద్ద నీడ కోసం చలువ పందిళ్లు వేయాలని, డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న రిలేయింగ్ ఫ్లోరింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్తూరులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించిన కలెక్టర్, మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు సూచించారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే వ్యాధులు దరిచేరవని పేర్కొన్నారు. గ్రామంలో వివిధ దశల్లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. లబ్ధిదారులు పనులను వేగంగా పూర్తి చేసుకుని ఉగాది పండుగ నాటికి గృహప్రవేశాలకు సిద్ధం కావాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. పాలు, ఆహార పదార్థాల ప్యాకెట్లపై గడువు తేదీలను నిశితంగా పరిశీలించాలని, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని టీచర్లను ఆదేశించారు. రక్తహీనతతో ఉన్న చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆటపాటలతో కూడిన ప్రీ-స్కూల్ బోధన అందించాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వీరస్వామి, డివిజనల్ పంచాయతీ అధికారి శ్రీధర్, ఆర్ అండ్ బీ డీఈ, సర్పంచ్ కోరం శైలజ, అంగన్‌వాడీ టీచర్ రోహిణి, ఆలయ గుత్తేదారులు, ఇతర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## గృహా నిర్బంధాలు ఆపండి..

నివాస హక్కులను గౌరవించండి

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** మూసీ సుందరీకరణ ప్రాజెక్టు సవివర నివేదిక ప్రజంటేషన్ నేపథ్యంలో, సామాజిక కార్యకర్తలపై ప్రభుత్వం గృహనిర్బంధాలు విధించడాన్ని మానవ హక్కుల వేదిక తీవ్రంగా ఖండించింది. ముఖ్యంగా నగర కమిటీ ఉపాధ్యక్షుడు, బస్తీ ప్రజల హక్కుల పోరాట యోధుడు సయ్యద్ బిలాల్‌ను గృహనిర్బంధం చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని సంస్థ నేతలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంస్థ రాష్ట్ర, నగర బాధ్యులు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేస్తూ ప్రభుత్వానికి పలు డిమాండ్లు చేశారు. మూసీ ప్రాజెక్టుకు సంబంధించిన నివేదికను పౌరులందరికీ అందుబాటులో ఉంచాలని, ఈ ప్రాజెక్టు ఆవశ్యకతపై నగర ప్రజల అభిప్రాయాలను స్వీకరించాలని డిమాండ్ చేశారు. బాపు ఘాట్ ప్రాంగణం పేరుతో ప్రజలను నిరాశ్రయులను చేయవద్దని, సామాజికవేత్త మేధా పాట్కర్ ఇప్పటికే కోరినట్లుగా ఈ ప్రాజెక్టును విరమించుకోవాలని సూచించారు. మూసీ నదిని శుభ్రం చేయడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే నిబంధనల మేరకు నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేయడం, సరైన పునరావాసం లేకుండా ప్రజలను ఖాళీ చేయించడాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలను గౌరవించాల్సింది పోయి, గృహనిర్బంధాలకు పాల్పడటం నిరంకుశత్వమేనని డాక్టర్ తిరుపతయ్య (రాష్ట్ర ప్రధాన కార్యదర్శి), ఎస్. జీవన్ కుమార్ (సమన్వయ కమిటీ సభ్యులు), ఎం. సురేష్ బాబు (హైదరాబాద్ అధ్యక్షులు), సంజీవ్ (నగర ప్రధాన కార్యదర్శి) విమర్శించారు.



## జనగణనను విజయవంతం చేయాలి

తహశీల్దార్ జగన్మోహన్ రెడ్డి

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 2027 జనాభా లెక్కల ప్రక్రియను మండలంలో సమర్థవంతంగా నిర్వహించాలని ఆత్మకూరు తహశీల్దార్ జగన్మోహన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి, ఎంఈఓ విజయ్ కుమార్‌లతో కలిసి జనగణన నిర్వహణపై సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. జనాభా లెక్కలు దేశాభివృద్ధికి, ప్రభుత్వ పథకాల రూపకల్పనకు ప్రాతిపదిక అని, అందుకే రెవెన్యూ, పంచాయతీ రాజ్, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమం రెండు దశల్లో ఉంటుందని ఆయన వివరించారు. మొదటి దశలో ఇళ్ల జాబితా, గృహాల గణన ఉంటుందని తెలిపారు. మండలంలోని రెవెన్యూ గ్రామాలను గణన బ్లాకులుగా విభజించే విధానం, క్షేత్రస్థాయిలో పాటించాల్సిన మార్గదర్శకాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. జనగణనలో ప్రతి ఒక్కరి వివరాలు నమోదు కావాలని, ఎక్కడా పొరపాట్లకు తావు లేకుండా ఖచ్చితమైన గణాంకాలను సేకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ, మండల సర్వేయర్, మండల సహాయ గణాంక అధికారి, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పాలన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పోరాటమే ఎజెండా

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి

**వరంగల్వాయిస్, హనుమకొండ :** దేశంలోని ప్రజా సమస్యల పరిష్కారమే భారత కమ్యూనిస్టు పార్టీ ఏకైక ఎజెండా అని, నిత్యావసరాల ధరలను అదుపు చేయడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి విమర్శించారు. శుక్రవారం గుండ్లసింగారం గ్రామంలోని సురవరం సుధాకర్ రెడ్డి కాలనీలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సమావేశానికి సీపీఐ మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్ అధ్యక్షత వహించారు. పాలకవర్గాల ప్రజా వ్యతిరేక విధానాలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులేనని భిక్షపతి పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అరకొరగా అమలు చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గొప్పలు చెప్పుకుంటున్నాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎన్.ఎ. స్టాలిన్, మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్, నాయకులు పొనుగోటి రాముగోపాల్ చారి, పూజారి అమృతయ్య, కట్కూరి కృష్ణ, పూజారి నరేందర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.






## ఇసుక రవాణాపై పోలీసుల పంజా

ట్రాక్టర్ సీజ్, నిందితుడిపై కేసు నమోదు

**వరంగల్ వాయిస్, చిట్యాల :** మండల పరిధిలో ఇసుకను తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకొని సీజ్ చేసినట్లు సబ్ ఇన్‌స్పెక్టర్ పి.సతీష్ తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. పై అధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐ సతీష్ పర్యవేక్షణలో గురువారం సాయంత్రం జడలపేట క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ ఎం.సురేందర్, కానిస్టేబుల్స్ నాగరాజు, బుర్ర రంజిత్ పాల్గొన్నారు. సాయంత్రం సుమారు 06:30 గంటల సమయంలో కాల్వపల్లి వాగు నుంచి ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్ ను పోలీసులు అడ్డుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ కమ్ ఓనర్ అయిన ఈర్రవేణి సంతోష్ ను విచారించగా, ఇసుక రవాణాకు సంబంధించి ఎటువంటి అనుమతి పత్రాలు లేవని తేలింది. ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా, దొంగతనంగా ఇసుకను తరలిస్తున్నందుకు గాను పోలీసులు పంచనామా నిర్వహించి ట్రాక్టర్‌ను, ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు సంతోష్‌పై కేసు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ తెలిపారు.



## నిధులు మంజూరు చేయాలి

మంత్రి శ్రీధర్ బాబుకు వినతిపత్రం

**వరంగల్ వాయిస్, మహదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ సరిత రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబుకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని కాలనీలలో సీసీ రోడ్లు మంజూరు చేయాలని, అలాగే మల్లన్న దేవుని ఆలయ నిర్మాణానికి అవసరమైన నిధులు విడుదల చేసి గ్రామ అభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు.

# గ్యాస్ గోదాంలపై సివిల్ సప్లై తనిఖీలు

- సిలిండర్లు స్వాధీనం.. కేసులు నమోదు
- వరంగల్ వాయిస్ కథనానికి స్పందన




**వరంగల్ వాయిస్, దోర్నకల్ :** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఇండెన్ ఏజెన్సీస్ సివిల్ సప్లై తో పాటు విజిలెన్సు అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు తనిఖీ చేశారు. అక్రమంగా నిల్వ చేసిన హెచ్‌పీ గ్యాస్ డొమెస్టిక్ సిలిండర్లు–3, ఇండెన్ గ్యాస్ డొమెస్టిక్ సిలిండర్లు–1, 5 కిలోల ఖాళీ సిలిండర్లు – 7,3 కిలోల ఖాళీ సిలిండర్లు – 12, మొత్తం 23 సిలిండర్లను స్వాధీనం చేసుకొని నిందితులపై 6–ఏ కేసు నమోదు చేసారు. స్వాధీనం చేసుకున్న సిలిండర్లను తగు భద్రత నిమిత్తం హెచ్‌పీ గ్యాస్ గోదాంకి తరలించారు. ఈ తనిఖీల్లో సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ, టాస్క్ ఫోర్స్ సీఐ వసంత్ కుమార్, సివిల్ సప్లై ఇన్ స్పెక్టర్ వీరలక్ష్మి, ఎసై హుస్సేన్ పాల్గొన్నారు. దోర్నకల్ మండల కేంద్రంలోని ఇండెన్ గ్యాస్ గోదాంలో ఎమ్మార్వో రాఘవ రెడ్డి తన సిబ్బందితో కలిసి తనిఖీ నిర్వహించారు. సిలిండర్ లను బ్లాక్ మార్కెట్ కు తరలించి అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని ఊరుగొండ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ సహాయ ఇంజినీర్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో అదనపు 5ఎంవీఆర్ పీటీఆర్ అభివృద్ధి పనులు చేపడుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. శనివారం ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు ఊరుగొండ, పసరగొండ, పులకుర్తి, దుర్గంపేట్, సీతారాంపూర్ గ్రామాలలో విద్యుత్ లో అంతరాయం ఏర్పడనుంది. అభివృద్ధి పనులు పూర్తి కాగానే విద్యుత్ సరఫరాను యధావిధిగా పునరుద్ధరిస్తామని, పైన పేర్కొన్న గ్రామాల వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి తమకు సహకరించాలని ఏఈ కోరారు.

## యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

**ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి**



**వరంగల్ వాయిస్, పరకాల :** మాదకద్రవ్యాల మహమ్మారి యువత భవిష్యత్తును చిన్నాభిన్నం చేస్తుందని పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక'లో భాగంగా, ఈగల్ ఫోర్స్ తెలంగాణ ఆధ్వర్యంలో ములుగు జిల్లా కేంద్రంలో నిర్వహించిన "పిల్లల భద్రత–డ్రగ్స్‌కు అడ్డుకట్ట" అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రోడ్డు భద్రత, యాంటీ డ్రగ్స్ ఫ్లెక్సీలను ప్రదర్శిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం రాజిరెడ్డి మాట్లాడుతూ పలు కీలక అంశాలను ప్రస్తావించారు. ఎవరైనా మాదకద్రవ్యాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించి, డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండి, చదువు మరియు క్రీడలపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పరకాల ప్రముఖ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ రోహిత్ సాదు, ఏఎంసీ వైస్ చైర్మన్ మారపల్లి రవీందర్, మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు బొమ్మకంటి రుద్రమదేవి చంద్రమౌళి, ఎం.కుమారస్వామి, దాసరి భిక్షపతి, పి.కుమారస్వామి, బి.కమల, వి.వెంకట రాజరెడ్డి, ఎస్.కుమారస్వామి, జి.విజయ్, బి.రాజయ్య, ఎండీ.రంజాన్ తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

**□ ఎంఈఓ లకావత్ రాజేష్ కుమార్**



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలో పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి లకావత్ రాజేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండల విద్యా వనరుల కేంద్రంలో ఆయన అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో పరీక్షల నిర్వహణపై కీలక ఆదేశాలు జారీ చేశారు. రేపటి నుంచి ప్రారంభం కానున్న ఈ పరీక్షలు ఏప్రిల్ 14 వరకు కొనసాగుతాయి. పరీక్ష సమయం ఉదయం 9:00 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు ఉంటుంది. మండలంలోని అన్ని పాఠశాలల నుంచి మొత్తం 571 మంది విద్యార్థులు (391 మంది బాలురు, 180 మంది బాలికలు) పరీక్షలకు హాజరవుతున్నారు. దామెర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో 243 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. వీరి కోసం 10 గదులను కేటాయించి, 15 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ఒక చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్, సి–సెంటర్ కస్టోడియన్ పర్యవేక్షణలో పరీక్షలు జరుగుతాయి. విద్యార్థుల కోసం గదుల్లో ఫ్యాన్లు, లైట్లు, ఫర్నిచర్, తాగునీరు, టాయిలెట్స్ వంటి కనీస వసతులను కల్పించారు. పరీక్షలు సజావుగా సాగేందుకు పోలీస్, రెవెన్యూ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారి సహకారం తీసుకుంటున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో ఉన్న జిరాక్స్, ప్రింటింగ్ షాపులను పరీక్ష సమయంలో మూసివేయాలని ఎంఈఓ ఆదేశించారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఆయన కోరారు.

## రైతులకు సాగునీరు అందేలా తక్షణ చర్యలు చేపట్టండి

**ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**



**వరంగల్ వాయిస్, పరకాల :** పంట పొలాలకు సాగునీరు అందక రైతులు ఇబ్బంది పడకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐనవోలు మండలం సింగారం గ్రామ శివారులోని డి–8 కెనాల్‌ను అధికారులతో కలిసి ఆయన స్వయంగా పరిశీలించారు. సింగారం వద్ద కెనాల్ గేటును కిందికి దించి వెల్డింగ్ చేయడం వల్ల నీటి ప్రవాహం ఆగిపోయిందని, దీనివల్ల దిగువన ఉన్న గ్రామాల రైతులకు సాగునీరు అందడం లేదని ఎమ్మెల్యే గుర్తించారు. సాగునీరు అందక ఇబ్బంది పడుతున్న సంగెం మండలంలోని ఆశాలపల్లి, గవిచర్ల, రామచంద్రపురం, షాపురం, కొత్తగూడెం గ్రామాలకు వెంటనే నీటిని విడుదల చేయాలని ఆదేశించారు. రైతులు తమ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఆయన సానుకూలంగా స్పందించి, కెనాల్ సమస్యను తక్షణమే పరిష్కరించి సాగునీరు అందేలా చూడాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, సాగునీటి విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.



## ఇఫ్తార్ విందులో రేవూరి

**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని ఒగ్లాపూర్ గ్రామంలోని సైలానీ బాబా దర్గాలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.రంజాన్ మాసం పవిత్రత, సహనం, సోదరభావానికి ప్రతీక అని తెలిపారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అల్లా ఆశీస్సులు అందరిపైనా ఉండాలని ప్రార్థనలు జరిపారు. ఈ కార్యక్రమంలో దర్గా పీఠాధిపతి అబ్దుల్ హమీద్ షామియా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రకాశ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి భిక్షపతి, స్థానిక సర్పంచి శ్రీధర్ రెడ్డి, ఊరుగొండ సర్పంచి శ్రీనివాస్, నాయకులు కోటి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## కట్కూరి రాజమౌళికి ఘన నివాళి

కట్కూరి రాజమౌళి ప్రథమ సంవత్సరీకం వరంగల్ కీర్తి గార్డెన్ లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, రాచర్ల పరమేశ్వర్, గాదె శంకరయ్య, అశోక్, మార్క విజయ్ హాజరై కట్కూరి రాజమౌళి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కట్కూరి రాజమౌళి కొడుకులు–కోడళ్లు కట్కూరి నాగభూషణం–జ్యోతి, కూతురు – అల్లుడు విద్యానాథ్ లు, మనువలు, మనువరాళ్లు, తదితరులు పాల్గొన్నారు.

*– వరంగల్ వాయిస్, వరంగల్*



## పది పరీక్షలకు పటిష్ట బందోబస్తు

**□ ఎస్సై కొంక అశోక్**

**వరంగల్ వాయిస్, దామెర :** పదవ తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు దామెర పోలీస్ స్టేషన్ పరిధిలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్సై కొంక అశోక్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రాన్ని స్వయంగా సందర్శించి, భద్రతా పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్సై పరీక్షల సూపరింటెండెంట్‌తో మాట్లాడి ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ క్రింది విషయాలను వెల్లడించారు. ఈ కేంద్రంలో మొత్తం 243 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. పరీక్షా కేంద్రం పరిసర ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా నిరంతరం పోలీస్ నిఘా ఉంటుందని, విద్యార్థులు ఎటువంటి ఆందోళన చెందకుండా పరీక్షలు రాయాలని సూచించారు.



## గ్రామ సిబ్బంది క్షేమమే.. ప్రగతికి మూలం

**సర్పంచ్ సనత్ కుమార్ పటేల్**

**వరంగల్ వాయిస్, పరకాల :** గ్రామ పంచాయతీ సిబ్బంది సంక్షేమమే గ్రామ అభివృద్ధికి అసలైన పునాది అని పరకాల మండలం అలియాబాద్ సర్పంచ్ శాతరాశి సనత్ కుమార్ పటేల్ అన్నారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన సిబ్బందికి రెండు నెలల వేతనాలను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా వారి అంకితభావాన్ని గుర్తిస్తూ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలోనూ, అభివృద్ధి పథంలో నడిపించడంలోనూ పంచాయతీ సిబ్బంది అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు. క్షేత్రస్థాయిలో సేవలు అందిస్తున్న సిబ్బందిని గ్రామస్తులందరూ గౌరవంగా చూడాలని, వారి సేవలకు తగిన గుర్తింపు ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అందరం కలిసికట్టుగా సహకారం అందిస్తూ అలియాబాద్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు. సమయానికి వేతనాలు అందించి, తమను సన్మానించిన సర్పంచ్ ఆదరణపై పంచాయతీ సిబ్బంది హర్షం వ్యక్తం చేయగా, ఆయన చొరవను గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.



# నిత్యావసర సరుకుల పంపిణీ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఆలయ ఫౌండేషన్ మార్గదర్శకులు పరికిపండ్ల నరహరి ఆదేశాల మేరకు, రుద్రమదేవి మహిళా మండలి సౌజన్యంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను వరంగల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో పలువురు నిరుపేద మహిళలకు నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, సమాజంలో అందుబాటులో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని ప్రముఖ అడ్వకేట్ & జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యురాలు డా.గోపికారాణి సూచించారు. ఎస్సై ఎం.సుధాకర్ మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకమని, స్త్రీ పురుష సమానత్వం ఉన్నప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. మహిళల సాధికారతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐసీటీసీ సూపర్వైజర్ ఆడపు రామకృష్ణ, రుద్రమదేవి మహిళా మండలి ప్రెసిడెంట్ ఎం.నీలాంబరి, సెక్రటరీ ఎం.సుజాత, ప్రాజెక్ట్ మేనేజర్ ఈశ్వర్, సీబీఓ మేనేజర్ పి.రాధిక, సంస్థ సిబ్బంది, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కోటగుళ్లలో ఎస్సై అశోక్ ప్రత్యేక పూజలు

**వరంగల్ వాయిస్, గణపురం :** కాకతీయుల చారిత్రక కళాక్షేత్రం, ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గణపురం కోటగుళ్లలో నూతన ఎస్సై బౌరగల అశోక్ శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల గణపురం ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఆయన, పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక అభిషేకం చేశారు. ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు ఎస్సైకి పూర్ణకుంభంతో సాదర స్వాగతం పలికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఎస్సై అశోక్‌ను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి స్వామివారి ఆశీర్వచనాలు అందజేశారు. మండల కేంద్రంలో బాధ్యతలు చేపట్టిన ఎస్సై బౌరగల అశోక్‌ను వివిధ సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అంబేద్కర్ యువజన సంఘం, ఎమ్మార్పీఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనను శాలువాతో సత్కరించారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తమ వంతు సహకారం అందిస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు శనిగరపు రాజేందర్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు బొల్లి బాబు, మాదిగ అంబేద్కర్ సంఘం గ్రామ కమిటీ అధ్యక్షులు తిక్క సంపత్, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు దూడపాక పున్నం, మండల నాయకులు చిలువేరు ఉదయాకర్, ఎడ్ల సదానందం, కొంపెల్లి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

 కలెక్టర్ దివాకర టీఎస్



**వరంగల్ వాయిస్, గోవిందరావుపేట/ ములుగు :** ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. '99 రోజుల ప్రజా ప్రణాళిక'లో భాగంగా శుక్రవారం ఆయన గోవిందరావుపేట మండలంలోని పసర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, క్షేత్రస్థాయిలో అందుతున్న వైద్య సేవలను స్వయంగా పరిశీలించారు. ఆసుపత్రిలోని హాజరు పట్టికను పరిశీలించిన కలెక్టర్, వైద్యులు, ఇతర సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. వైద్యం కోసం వచ్చే ప్రజలు వేచి ఉండే పరిస్థితి రాకూడదని హెచ్చరించారు. ఆసుపత్రిలో మందులు ఉచితంగా అందుతున్నాయా? వైద్యులు అందుబాటులో ఉంటున్నారా? అనే అంశాలపై అక్కడ చికిత్స పొందుతున్న రోగులను అడిగి తెలుసుకున్నారు. గర్భిణీ స్త్రీలకు ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా వారిలో అవగాహన కల్పించాలని వైద్యాధికారులకు దిశానిర్దేశం చేశారు. అత్యవసర మందుల కొరత లేకుండా చూడాలని, ఫార్మా స్టాక్ రిజిస్టర్‌ను ప్రతిరోజూ అప్‌డేట్ చేయాలని ఫార్మసిస్ట్‌కు సూచించారు. వార్డులు, వాష్‌రూమ్‌లను నిరంతరం శుభ్రం చేయించాలని, ఆసుపత్రి పరిసరాల్లో నిరుపయోగంగా ఉన్న పాత పరికరాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. రోగులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పసర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మధు, ఆసుపత్రి సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# రూ.10 కోట్లతో 'తెలంగాణ తిరుపతి' అభివృద్ధి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- ఆలయ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం
- రెండోసారి చైర్మన్‌గా పొట్లపల్లి శ్రీధర్ రావు

**వరంగల్ వాయిస్, చిల్పూర్ :** చిల్పూర్ శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని రాబోయే ఏడాది కాలంలో రూ.10 కోట్ల వ్యయంతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తానని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి వెల్లడించారు. శుక్రవారం చిల్పూర్ మండల కేంద్రంలోని ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, నూతన పాలక మండలి చైర్మన్‌గా పొట్లపల్లి శ్రీధర్ రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పొట్లపల్లి శ్రీధర్ రావు కేవలం భక్తితోనే కాకుండా, సేవా భావంతో సొంత ఖర్చులతో ఆలయ అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని కొనియాడారు. ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్లతో మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని, ఈ నిధులను రెండు నెలల్లో ముఖ్యమంత్రి ద్వారా మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఏడాదిలోగా ఈ అభివృద్ధి పనులన్నీ పూర్తి చేసి, భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని, మెరుగైన సౌకర్యాలను అందించే బాధ్యత నాదేనని స్పష్టం చేశారు. . రెండోసారి తనపై నమ్మకంతో చైర్మన్‌గా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరికి పొట్లపల్లి శ్రీధర్ రావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో లక్ష్మి ప్రసన్న, దేవాదాయ శాఖ అధికారులు, పాలక వర్గ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇద్దరు విలేకరులపై ఆశ వర్కర్ల ఫిర్యాదు

 అసత్యం వార్తలు ప్రచురించారని ఆగ్రహం



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** తమపై నిరాధారమైన ఆరోపణలతో తప్పుడు వార్తలు ప్రచురించిన ఇద్దరు విలేకరులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పర్వతగిరి మండలానికి చెందిన ఆశ వర్కర్లు శుక్రవారం అధికారులను ఆశ్రయించారు. ఆదాబ్ హైదరాబాద్, ప్రజా జ్యోతి పత్రికల్లో వచ్చిన కథనాలపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆశ వర్కర్లు గ్రామాల్లో అందుబాటులో ఉండటం లేదని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని సదరు పత్రికల్లో వచ్చిన వార్తలు ముమ్మాటికీ అబద్ధమని వారు ఖండించారు. క్షేత్రస్థాయిలో తాము పడుతున్న శ్రమను గుర్తించకుండా, వాస్తవాలు పరిశీలించకుండా వార్తలు రాయడంపై మండిపడ్డారు.ఈ సందర్భంగా ఆశ వర్కర్లు మాట్లాడుతూ గర్భిణీ స్త్రీల నమోదు, పిల్లలకు సకాలంలో టీకాలు వేయించడం, గ్రామాల్లో ఆరోగ్య అవగాహన కల్పించడం వంటి విధులను అంకితభావంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇలాంటి తప్పుడు కథనాల వల్ల గ్రామ ప్రజల్లో తమపై అనవసరమైన అపోహలు ఏర్పడుతున్నాయని, ఇది తమ వృత్తి గౌరవానికి భంగం కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పత్రికా స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తూ తప్పుడు సమాచారాన్ని ప్రచురించిన విలేకరులపై సమగ్ర విచారణ జరిపి, కఠిన చర్యలు తీసుకోవాలని తహశీల్దార్, పోలీసు శాఖ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం జరగని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆశ వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పది పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు అమలు

 సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పదవ తరగతి వార్షిక పరీక్షలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత తెలిపారు. పరీక్షల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ కోసం పరీక్షా కేంద్రాల పరిసరాల్లో సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ (పాత 144 సెక్షన్) కింద నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలోని మొత్తం 150 కేంద్రాలలో (హనుమకొండ-64, వరంగల్-47, జనగామ-39) రేపటి నుంచి ఏప్రిల్ 16 వరకు ఉదయం 09:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. పరీక్షా కేంద్రాలకు 500 మీటర్ల పరిధిలో ఉన్న అన్ని జిరాక్స్ షాపులను రేపటి నుంచి ప్రతిరోజూ ఉదయం 06:00 గంటల నుంచి మధ్యాహ్నం 02:00 గంటల వరకు తప్పనిసరిగా మూసివేయాలి. పరీక్షా కేంద్రాల వద్ద ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు సమూహాలుగా ఏర్పడకూడదు. ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు లేదా ధర్నాలకు అనుమతి లేదు. ఎవరైనా ఈ నిబంధనలను అతిక్రమిస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ హెచ్చరించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా తల్లిదండ్రులు, ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని ఆమె కోరారు.

వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శుక్రవారం, మార్చి 13, 2026

# భద్రకాళి చెరువు పునరుద్ధరణకు రూ.16.10 కోట్లు

- ఎమ్మెల్యే నాయిని, మేయర్, కలెక్టర్
- చెరువు పూడికతీత పనులకు శ్రీకారం
- మే 15 లోగా పనులు పూర్తి చేయాలని డెడ్ లైన్
- ఆలయం నుంచి బండ్ వైపు 'గ్లాస్ వంతెన'



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ నగర మకుటాయమానమైన భద్రకాళి చెరువును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా మారుస్తామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి వెల్లడించారు. '99 రోజుల ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక'లో భాగంగా శుక్రవారం నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌లతో కలిసి ఎమ్మెల్యే భద్రకాళి చెరువు పూడికతీత పనులకు కొబ్బరికాయ కొట్టి అధికారికంగా శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో రూ.9 కోట్లతో చేపట్టిన పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయని, అందుకే ప్రస్తుత ప్రభుత్వం రూ.16.10 కోటతో సమగ్రంగా పూడికతీత పనులను చేపడుతోందని తెలిపారు. సుమారు 7 లక్షల క్యూబిక్ మీటర్ల పూడికను మే 15వ తేదీ లోపు తొలగించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభం కావడానికి ముందే పనులు పూర్తి కావాలని స్పష్టం చేశారు. భక్తులను ఆకట్టుకునేలా ఆలయం నుంచి బండ్ వైపు అత్యంత అధునాతనమైన గ్లాస్ వంతెన ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ప్రకటించారు. దాదాపు 70 ఏళ్ల క్రితం జరిగిన పూడికతీత పనులు, మళ్లీ ఇప్పుడు తన ప్రాతినిధ్యంలో జరగడం ఎంతో సంతోషాన్నిస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో మాడ వీధుల నిర్మాణం, చెరువు పునరుద్ధరణ పనులను ఎక్కడా రాజీ పడకుండా చేపడుతున్నామని, సమష్టి కృషితో వరంగల్ నగరాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెడతామని ప్రజాప్రతినిధులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దేవరకొండ విజయలక్ష్మి సురేందర్, మామిండ్ల రాజు, ఇరిగేషన్ ఎస్.ఈ రాంప్రసాద్, ఈ.ఈ కిరణ్ కుమార్, కుడా ఈ.ఈ భీమ్ రావు, ఇరిగేషన్ డి.ఈ మధుసూదన్, ఏ.ఈలు వేణుగోపాల్, శ్యామ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# మెదడు శస్త్రచికిత్సల్లో విప్లవం

- రోబోటిక్ నావిగేషన్‌తో ప్రాణాలు సురక్షితం
- యశోద హాస్పిటల్స్ వైద్యుల అద్భుతం




**వరంగల్ వాయిస్, వరంగల్/సికింద్రాబాద్ :** మెదడు సంబంధిత వ్యాధులు, ట్యూమర్ల చికిత్సలో వైద్యరంగం సరికొత్త శిఖరాలను అధిరోహిస్తోంది. సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్‌లో అందుబాటులో ఉన్న అధునాతన రోబోటిక్ మరియు నావిగేషన్ టెక్నాలజీతో క్లిష్టమైన సర్జరీలు కూడా ఇప్పుడు అత్యంత సురక్షితంగా మారుతున్నాయి. ఇటీవల వరంగల్‌కు చెందిన ఒక మహిళకు నిర్వహించిన అరుదైన శస్త్రచికిత్స వివరాలను డాక్టర్ కె.ఎస్.కిరణ్ వెల్లడించారు. వరంగల్ నుంచి వచ్చిన 50 ఏళ్ల మహిళా పేషెంట్ గత నెల రోజులుగా మెదడులో గడ్డ, టీబీ లక్షణాలతో బాధపడుతున్నారు. సాధారణ టీబీ మందులు వాడినా ఫలితం లేకపోవడంతో ఆమెను యశోద హాస్పిటల్స్‌కు తరలించారు. డాక్టర్ కిరణ్ బృందం 'రోబోటిక్ నావిగేషన్ అసిస్టెడ్ బయాప్సీ' ద్వారా ఆ గడ్డను పరిశీలించగా, అది ప్రమాదకరమైన 'డ్రగ్–రెసిస్టెంట్ టీబీ'గా తేలింది. రోబోటిక్ సర్జరీ వల్ల గడ్డను విజయవంతంగా తొలగించడమే కాకుండా, సర్జరీ జరిగిన మరుసటి రోజే ఆమెను డిశ్చార్జ్ చేయడం విశేషం. చిన్న రంధ్రం ద్వారా ఎండోస్కోప్ ఉపయోగించి చేసే ఈ పద్ధతి వల్ల పేషెంట్ చాలా త్వరగా కోలుకుంటారు. ఇన్ఫెక్షన్ భయం ఉండదు. పాత పద్ధతుల్లో ఆపరేషన్ పూర్తయి మత్తు వదిలాక గానీ పేషెంట్ చేతులు, కాళ్లు పనిచేస్తున్నాయో లేదో తెలిసేది కాదు. కానీ యశోదలోని ఇంట్రా–ఆపరేటివ్ ఎంఆర్ఐ, రోబోటిక్ సిస్టమ్స్ వల్ల ఆపరేషన్ టేబుల్ మీదే ప్రతి కదలికను గమనిస్తూ అత్యంత సురక్షితంగా ట్యూమర్‌ను తొలగించే అవకాశం ఉంటుందని డాక్టర్ కిరణ్ వివరించారు. ఆసుపత్రిలో తక్కువ రోజులు ఉండటం వల్ల ఖర్చు తగ్గుతుంది. అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, సరైన సమయంలో తీసుకునే నిర్ణయం ప్రాణాలను కాపాడుతుందని వైద్యులు సూచిస్తున్నారు.

# రాష్ట్రంలో గ్యాస్ కొరత లేదు

- వదంతులు నమ్మొద్దు
- కలెక్టర్లు, ఎస్పీలతో మంత్రుల వీడియో కాన్ఫరెన్స్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ కొరత ఉందంటూ జరుగుతున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని రాష్ట్ర పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుండి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీఎస్ రామకృష్ణారావులతో కలిసి ఆయన జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హనుమకొండ కలెక్టరేట్ నుండి కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, డీసీపీ దార కవిత, అదనపు కలెక్టర్ ఎన్.రవి తదితరులు పాల్గొన్నారు. అమెరికా–ఇరాన్ యుద్ధం కారణంగా గ్యాస్ కొరత ఏర్పడిందనే సోషల్ మీడియా ప్రచారంలో వాస్తవం లేదని మంత్రి స్పష్టం చేశారు. ఇలాంటి తప్పుడు వార్తలను నమ్మి ప్రజలు భయాందోళనతో ముందస్తు బుకింగ్‌లు చేసుకోవద్దని కోరారు. గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రులు, విద్యా సంస్థలు, ప్రభుత్వ హాస్టళ్లు, ఆశ్రమాలకు గ్యాస్ సరఫరాలో మొదటి ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. గ్యాస్ కొరత సాకుతో బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 288 కేసులు నమోదు చేశామని, అక్రమాలకు పాల్పడే డిస్ట్రిబ్యూటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రతి జిల్లాలో కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి నిల్వలు, సరఫరాను పర్యవేక్షించాలని సూచించారు. రాష్ట్రస్థాయిలో కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పరిస్థితిని సమీక్షిస్తామన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. యాసంగి ధాన్యం సేకరణకు గన్నీ సంచులు, గోదాములను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సాగునీటి లభ్యతను బట్టి పంటలను ప్రోత్సహించాలని, ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంచేలా రైతులను చైతన్యపరచాలని కలెక్టర్లకు సూచించారు. హనుమకొండ నుంచి పాల్గొన్న వారిలో ఇరిగేషన్ సీఈ సుధీర్, పౌరసరఫరాల అధికారి వాజిద్ అలీ, వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, మార్కెటింగ్ అధికారి అనురాధ, మార్క్ ఫెడ్ అధికారులు తదితరులు ఉన్నారు.

# గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం

□ ఇనుగాల వెంకట్ రామ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ మార్గదర్శకత్, రాహుల్ గాంధీ ప్రత్యేక సందేశం మేరకు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత శక్తివంతంగా నిర్మించాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్ రామ్ రెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ సిద్ధాంతాలను నమ్మి పనిచేసే ప్రతి కార్యకర్తను ఐక్యంగా ముందుకు తీసుకెళ్లడమే జాతీయ నాయకత్వం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ విలువలపై విశ్వాసం ఉండి, ఇతర పార్టీల నుంచి చేరదలచిన నాయకులు, కార్యకర్తలను పార్టీ సాదరంగా ఆహ్వానిస్తుందని తెలిపారు. ప్రజాస్వామ్యం, లౌకికత, సామాజిక న్యాయం లక్ష్యంగా కాంగ్రెస్ ఎప్పుడూ ఒక విశాల వేదికగా ఉంటుందన్నారు. జిల్లాలోని శాసనసభ్యులు, సీనియర్ నాయకులు తమ పరిధిలోని గ్రామ కమిటీలను బలోపేతం చేయాలని, ముఖ్యంగా బూత్ స్థాయిలో కమిటీల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు. పార్టీ విస్తరణలో యువత పాత్ర కీలకమని, నూతన ఉత్సాహవంతులను గుర్తించి పార్టీలోకి ఆహ్వానించడం ద్వారా సంస్థను మరింత బలోపేతం చేయాలని కోరారు. వ్యక్తిగత విభేదాలను పక్కన పెట్టి, పార్టీ ప్రయోజనాల కోసం అంకితభావంతో పనిచేయాలని హితవు పలికారు. క్రమశిక్షణతో కూడిన ఐక్యతే రాబోయే ఎన్నికల్లో విజయానికి పునాది అని స్పష్టం చేశారు. రాబోయే నెలలు పార్టీ విస్తరణకు అత్యంత కీలకమని, ప్రతి మండల, గ్రామ యూనిట్ ప్రజల సమస్యలపై స్పందిస్తూ ప్రభుత్వ ప్రజా రంజక విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రైతు, మహిళా, దళిత, గిరిజన మరియు మైనారిటీ వర్గాల ఆకాంక్షలను నెరవేర్చే ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బలమైన, ప్రజా కేంద్రిత కాంగ్రెస్ నిర్మాణమే మనందరి లక్ష్యం కావాలని, ఈ క్రమంలో ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలని విజ్ఞప్తి చేశారు.



# మత సామరస్యానికి ప్రతీక వరంగల్ నగరం

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- కాజీపేటలో ఘనంగా ఫాతిమా మాత మహోత్సవం

**వరంగల్ వాయిస్, కాజీపేట (ఫాతిమా నగర్) :** వరంగల్ నగరం మత సామరస్యానికి, భిన్నత్వంలో ఏకత్వానికి నిలువుటద్దమని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం కాజీపేట ఫాతిమా నగర్‌లోని ప్రసిద్ధ ఫాతిమా మాత చర్చిలో నిర్వహించిన 'ఫాతిమా మాత మహోత్సవ' వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చి నిర్వాహకులు, క్రైస్తవ మత పెద్దలు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ హిందూ, ముస్లిం, క్రైస్తవ సోదరులంతా పరస్పర గౌరవంతో, ఐక్యతతో జీవించడం వరంగల్ సంస్కృతి అని కొనియాడారు. ఇలాంటి ఆధ్యాత్మిక ఉత్సవాలు సమాజంలో సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఏటా కాథలిక్ క్రైస్తవులు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఫాతిమా మాత వేడుకలు ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపుతాయని, ఈ పవిత్ర వేడుకలో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ వేడుకల్లో కార్పొరేటర్ మానస రాంప్రసాద్, మాజీ కార్పొరేటర్ అబూబకర్, సీనియర్ నాయకులు ఎస్.టి పాల్ ఆనంద్, కార్డినల్ పూనా అంతోని, విశ్రాంత బిషప్ జోసెఫ్, పాలనాధికారి ఫాదర్ విజయపాల్, ఫాతిమా చర్చి గురువు మర్రెడ్డి, స్థానిక క్రైస్తవ మత పెద్దలు, చర్చి కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com